సాక్షి
మంచిర్యాల

గురువారం । 13 । జూన్ । 2024

పదేళ్లుగా ప్రమోషన్లు బంద్

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఎస్‌డీఎల్ యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ యంత్రాలపై పని చేసే ఆపరేటర్లను మాత్రం యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

8లో▸



హరితహారానికి సన్నద్ధం

జిల్లాలో హరితహారం నిర్వహణకు అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 20లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రివేళ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సోనియాను కలిసిన ఎమ్మెల్యే వినోద్



సోనియా గాంధీతో వినోద్ కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుటుంబ సమేతంగా బుధవారం కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీకి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబం వరుసగా కాంగ్రెస్ అగ్రనేతలను కలుస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రెండు రోజుల క్రితం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలువగా, తాజాగా సోనియాగాంధీని కలిశారు. ఎమ్మెల్యే వినోద్ వెంట ఆయన భార్య రమాదేవి, కూతురు వర్ష, మనవడు, మనవరాలు ఉన్నారు. అక్కడి నుంచి ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

అర్హత లేని వైద్యులపై కేసు నమోదు

మంచిర్యాలటౌన్: అర్హత లేని వైద్యులపై కేసు నమోదైనట్లు టీఎస్‌ఎంసీ సభ్యుడు డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ తెలిపారు. టీజీఎంసీ, ఎన్ఎంసీ బృందాలు గత నెల 15న జిల్లాలో తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అర్హత లేని వైద్యం చేస్తూ వివిధ రకాల యాంటిబయోటిక్స్ మోతాదుకు మించి ఇవ్వడం వల్ల ఎలాంటి మందులకు లొంగని వ్యాధులు వస్తాయని, క్లినిక్‌లకు శాఖపరమైన అనుమతులు లేవని, సరైన బయో మెడికల్ వేస్ట్ నియమాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. అర్హత లేని వైద్యులపై కేసు నమోదు చేశారని, వీరిలో శ్రీరాంపూర్‌కు చెందిన మొండయ్య, నస్పూరుకు చెందిన గుండా సుధాకర్, చుంచు శంకరయ్య, బిట్ల వెంకటస్వామి, అతికం శ్రీనివాస్, నిగ్గుల కుమారస్వామి, మందమర్రికి చెందిన పోషం, కాగజ్‌నగర్‌కు చెందిన జి.లక్ష్మణ్, అశోక్ మంచాల, మంచిర్యాలకు చెందిన ఉస్మాన్, సంతోష్, సురేష్ ఉన్నారని తెలిపారు.

కొనసాగుతున్న టీజీఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: టీజీ ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో బుధవారం కౌన్సెలింగ్ కొనసాగింది. విద్యార్థులు ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నారు. విద్యార్థుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 95 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆర్టిస్ట్ పోచంకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న మహిళలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన ఏల్పుల పోచం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర చేపట్టి విజయవంతంగా పూర్తి చేసుకుని బుధవారం చెన్నూర్‌కు వచ్చిన సందర్భంగా పట్టణ వాసులు, మిత్రబృందం ఘన స్వాగతం పలికారు. ఏడేళ్ల శ్రమించి యాత్రను ముగించుకుని వచ్చిన పోచం విజయాన్ని చెన్నూర్ ప్రజలకు తెలియజేసేందుకు స్థానిక జలాల్ పెట్రోల్ బంక్ నుంచి మారెమ్మవాడలోని పోచం ఇంటి వరకు జాతీయ జెండాలు పట్టుకొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆర్టిస్టులు మద్దూరి రాజన్న, కౌన్సిలర్ వేల్పుల సుధాకర్, మిత్ర బృందం సభ్యులు పిట్టల రవీందర్, రాజు, తిరుపతి సురేశ్ పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులపై హెచ్‌ఆర్ చిన్నచూపు'

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ చేపడుతున్న పవర్ మేక్ కంపెనీ హెచ్‌ఆర్ మధు కాంట్రాక్టు కార్మికులపై చిన్నచూపు చూస్తున్నారని, దురుసుగా ప్రవర్తిస్తున్నారని కాంట్రాక్టు కార్మికులు వాపోయారు. భూనిర్వాసిత, ప్రభావిత కాంట్రాక్టు కార్మికులు హెచ్‌ఆర్ మధు వేధింపులపై సింగరేణి పర్సనల్ మేనేజర్ రామశాస్త్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై ప్రశ్నించిన కార్మికులకు వార్నింగ్ లేటర్లు ఇస్తూ మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. భూనిర్వాసిత, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, గంగిపల్లి మాజీ సర్పంచ్ పాలమాకుల లింగారెడ్డి, కార్మికులు ఏల్కటూరి రమేష్, వలీమహ్మద్, కొండయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిషేధమని తెలిసీ!



పోలీసులకు పట్టుబడిన నిషేధిత పత్తి విత్తనాలు

- విక్రయాలు.. వినియోగం
- హెచ్‌టీ విత్తనం, గ్లైఫోసెట్ గడ్డి మందు
- ఏటా సీజన్‌లో రైతులకు అక్రమ రవాణా
- కేసులు నమోదు చేస్తున్నా ఆగని దందా



పోలీసులు పట్టుకున్న విత్తనాలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిషేధిత పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ గడ్డిమందులు జిల్లాను ముంచెత్తుతున్నాయి. కఠిన చర్యలు తీసుకుంటున్నా ఏటేటా వీటికి డిమాండ్ తగ్గడం లేదు. చాలామంది రైతులు కలుపుమందును తట్టుకుంటుందనే నమ్మకంతో హెచ్‌టీ(హెర్బిసైడ్ టాలరెంట్) వెరైటీపై ఆసక్తి చూపిస్తున్నారు. వీటిని విత్తుకుంటే కలుపు నివారణి గ్లైఫోసెట్ పిచికారీ చేసినా పత్తి మొక్కకు నష్టం కాకుండా గడ్డి మాత్రమే చనిపోతుందనే నమ్మకం రైతుల్లో ఉంది. దీంతో పత్తి విత్తుకునే రెండు నెలల ముందు నుంచే అక్రమ మార్గాల్లో రైతులకు చేరుతున్నాయి. ఇక వర్షాలు మొదలయ్యాక గ్లైఫోసెట్ క్రిమిసంహారక మందును చాటుగా తరలిస్తుంటారు. హెచ్‌టీ విత్తనాలు, గడ్డి మందు రెండింటితోనూ ఏటా రూ.కోట్లలో అక్రమ వ్యాపారం సాగుతోంది. రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఉన్నప్పటికీ పోలీసు అధికారులే ఎక్కువగా ఈ దందాను అడ్డుకుంటున్నారు. గత నాలుగేళ్లలో తరచూ నేరాలు చేసే 18మందిపై పీడీ యాక్టు నమోదు చేశారు.

మధ్యవర్తులతో రవాణా

నిషేధిత పత్తి విత్తనాల సాగు, గ్లైఫోసెట్ వాడితే భూసారం తగ్గి అనేక నష్టాలు ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేళ్ల క్రితమే నిషేధించాయి. అనధికారికంగా రైతులకే అంటగడుతూ విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ విత్తన వెరైటీలు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రా నుంచి ఈ ప్రాంతానికి వస్తున్నాయి. గుంటూరు, కర్నూల్ జిల్లాల నుంచి అధికంగా రవాణా చేస్తున్నారు. ఇందుకోసం వేసవిలోనే గుర్తింపు లేని కంపెనీలు తమ ఏజెంట్లతో దందా చేస్తున్నాయి. స్థానికంగా రైతులతో పరిచయం ఉన్న వారిని మధ్యవర్తిగా పెడుతూ విక్రయాలు చేస్తున్నాయి. జిల్లా నుంచి కూడా కొందరు డబ్బులకు ఆశపడి విత్తనాలు చాటుమాటున రవాణా చేస్తున్నారు. రెండేళ్ల క్రితం తరచూ ఈ విత్తన దందా చేస్తున్న వారిపై పీడీ యాక్టు నమోదైంది. అయినా తీరు మారడం లేదు. ఈ సీజన్‌లోనూ రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో క్వింటాళ్ల కొద్దీ గుర్తింపు లేని విత్తనాలు పట్టుబడుతున్నాయి.

అక్రమ మార్గాలు అనేకం

జిల్లాకు అనేక రవాణా మార్గాల్లో విత్తనాలు చేరుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, రైలుమార్గంతోపాటు గూడ్స్ రవాణా మాటున తీసుకొస్తున్నారు. విడిగా క్వింటాళ్ల కొద్దీ సంచుల్లో తెస్తున్నారు. మందమర్రి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, భీమారం, చెన్నూరు, కోటపల్లితోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, బెజ్జూరు మండలాల గ్రామాల వరకు సరఫరా చేస్తున్నారు. రైతులకు ఇదంతా తెలిసినప్పటికీ కలుపు బెడదతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయనే ఈ విత్తనాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఏటేటా వీటిని అరికట్టాలని గట్టి నిఘా పెడుతున్నప్పటికీ పూర్తిగా కట్టడి కావడం లేదు. ఇక కొందరు రైతులే నేరుగా వెళ్లి పది, ఇరవై కిలోల చొప్పున తెచ్చుకుని తెలిసిన వారికి అమ్మేస్తున్నారు. విత్తనాలు సరఫరా, ఏజెంట్ల వరకే కేసుల దర్యాప్తు నిలిచిపోతోంది. విత్తనాలు ఉత్పత్తి చేసే వరకు వెళ్తే సూత్రధారులు బయటపడే అవకాశం ఉంది. ఇక గ్రామాల్లో నిషేధిత విత్తనాలు, గడ్డి మందుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన వ్యవసాయాధికారుల అలసత్వంతోనూ ఈ అక్రమ దందా ఆగడం లేదు.

రామగుండం కమిషనరేట్ పరిధిలో నమోదైన నకిలీ విత్తనాల కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు	పట్టుబడినవారు	సీజ్‌చేసిన విత్తనాలు(క్వింటాళ్లలో)	విలువ(రూ.లలో)
2019	24	51	50.28	74,76,970
2020	30	88	185.9	1,14,03,628
2021	55	141	48.88	91,98,377
2022	13	30	14.83	27,97,000
2023	04	12	13.33	26,81,000
2024	10	15	15.24	44,11,000

బడికి కరెంటు బిల్లు తప్పేదెలా..!

- స్కూళ్లకు సౌరకాంతులపై ప్రతిష్టంభన
- ఉచిత విద్యుత్ అమలుపై అస్పష్టత



సౌర పలకలు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు మంజూరు చేసిన సౌర విద్యుత్ అమలుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నాబార్డు సహకారంతో సౌర యూనిట్లు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. టీఎస్ రెడ్కో(పునరుత్పాదక ఇంధన సంస్థ)కు అవసరమైన పాఠశాలలను ఎంపిక చేశారు. డిసెంబర్‌లోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా స్పష్టత కరువైంది. మరోవైపు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థల్లో ఉచిత విద్యుత్ అమలు చేయాలని యోచించింది. పాఠశాలల్లో ఫిబ్రవరి నెలలో విద్యుత్ వినియోగం, పాత బకాయిల వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా బాధ్యత ప్రభుత్వానిదేనని, దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తాజాగా పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో అటు సౌర వెలుగులు.. ఇటు ఉచిత విద్యుత్ అమలుపై స్పష్టత లేకపోవడంతో విద్యుత్ బిల్లుల భారం తప్పేలా కనిపించడం లేదు.

సౌర వెలుగులకు 133 పాఠశాలల ఎంపిక

విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు సోలార్ సిస్టం అమలుకు జిల్లాలో 133 పాఠశాలలు ఎంపిక చేశారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే సోలార్ విద్యుత్ పలకలతో రెండు కిలో వాట్స్ నుంచి పది కిలో వాట్స్ వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కిలోవాట్స్‌ను బట్టి రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు వ్యయం చేయాలని నిర్ణయించారు. బ్యాటరీ ఇన్వర్టర్ల ద్వారా సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసుకుని పాఠశాలల్లో అవసరం మేరకు వినియోగించాలని భావించారు. కానీ తొలి విడత ఎంపిక చేసిన పాఠశాలల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థ అమలుపై ఎటూ తేలకుండా పోయింది.

ఉత్తర్వులు మాత్రమే వచ్చాయ్

సర్కారు పాఠశాలల్లో విద్యుత్ సరఫరా అందించాలని కొన్ని పాఠశాలలను ఎంపిక చేస్తూ గతంలో ఉత్తర్వులు వచ్చాయి. తర్వాత ఏర్పాటుపై ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉచిత విద్యుత్ అమలుపై ఇంకా ఆదేశాలు రావాల్సి ఉంది.

– యాదయ్య, డీఈవో

ఉచిత విద్యుత్ ఎప్పుడో..?

బడుల నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లో నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. సర్కారు పాఠశాలల్లో ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్ తప్పనిసరిగా ఉంటుంది. ఇటీవల కొన్ని పాఠశాలల్లో డిజిటల్ తెరలు ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. విద్యుత్ శాఖ విద్యా సంస్థలను కేటగిరీ–7 కింద పరిగణనలోకి తీసుకుని యూనిట్‌కు రూ.8.30 చార్జి చేస్తోంది. ఈ లెక్కన ఒక్కో పాఠశాలకు వినియోగించిన విద్యుత్‌ను బట్టి రూ.250 నుంచి రూ.5వేలకు పైగా బిల్లు వస్తోంది. పాఠశాలల్లో అనేక కరెంటు సమస్యలతో నెట్టుకువస్తున్న సందర్భాలున్నాయి. ఉచిత విద్యుత్ అమలు చేయాలనే యోచనతో ఫిబ్రవరిలోనే విద్యాశాఖ వివరాలు సేకరించింది. ఇందులో కొన్ని పాఠశాలల్లో విద్యుత్ మీటర్ నాట్ అవైలేబుల్, బిల్ నాట్ జనరేట్ అనే పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేకపోగా.. మీటర్ నంబరు కేటాయించనివీ ఉన్నాయని తేలింది. విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతున్న తరుణంలో పాఠశాలల్లో సౌర వెలుగులు.. ఉచిత విద్యుత్ అమలుపై స్పష్టత లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎరువుల కోసం రైతుల రాస్తారోకో



వేమనపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

వేమనపల్లి: మండలానికి ఎరువుల బస్తాలు రావడం లేదని రైతులు బుధవారం రోడ్డెక్కారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. వేమనపల్లి, ఒడ్డుగూడెం, కల్మలపేట, కేతన్‌పల్లి శివారులోని పంట చేలకు దారులు లేవు. వర్షాకాలం ఎడ్లబండ్లు కూడా వెళ్లలేని దుస్థితి ఉంటుంది. దీంతో పత్తి చేలల్లోనే పంటకు సరిపడా ఎరువులు రైతులు నిల్వ చేస్తుంటారు. దుకాణాల్లో ఎరువులు లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకముందే ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఏడీఏ ఇంతియాజ్‌అహ్మద్, ఏఓ వీరన్నకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రెండు రోజుల్లో ఎరువులు అందేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మల్లిడిలో డీపీఓ విచారణ

భీమిని: మండలంలోని మల్లిడి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై డీపీవో వెంకటేశ్వర్లు బుధవారం విచారణ జరిపారు. నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఇటీవల పలువురు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టి పలువురిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ మొబైల్ యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎల్‌పీఓ సబ్దర్‌అలీ, మాజీ సర్పంచ్ బల్లం సంతోష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

చదువుతోనే మార్పుకు శ్రీకారం



ముల్కల్లలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేస్తున్న కలెక్టర్ సంతోష్, పక్కన డీఈవో యాదయ్య

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



రాపల్లిలో నోట్‌బుక్స్ అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చదువు ఉన్నతంగానే కాదు మానవ మనుగడలో గొప్ప మార్పుకు శ్రీకారం చుడుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం ముల్కల్ల, రాపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా డీఈవో యాదయ్య, డీఆర్‌డీఓ కిషన్‌లతో కలిసి విద్యార్థులకు యూని ఫాం, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, పిల్ల లు చదువుల్లో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులు కుట్టి ఇచ్చిన 42 వేల యూనిఫాంలు అందించేలా ఏర్పాట్లు చేసి సఫలీకృతమయ్యామని అన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, మరమ్మతులు సకాలంలో పూర్తి చేసేలా అమ్మ ఆదర్శ కమిటీలతోపాటు ఉపాధ్యాయుల సహకారం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, తహసీల్దార్ సతీశ్‌కుమార్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, సమాఖ్య సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- ఫ్లడ్ రెస్క్యూ బృందం ప్రదర్శన



రెస్క్యూ టీం సభ్యులతో కలెక్టర్, సీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తోందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరిపై గల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద ఫ్లడ్ రెస్క్యూ టీం నిర్వహించిన డెమో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ సంతోష్ హాజరయ్యారు. రెస్క్యూ టీం విన్యాసాలను తిలకించారు. హైదరాబాద్‌లో మంచిర్యాల జోన్‌కు చెందిన 44 మంది శిక్షణ పొందగా.. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన సమయంలో కానీ గోదావరిలో గల్లంతైన సమయంలో వారిని ఎలా రక్షిస్తారో ప్రదర్శన ఇచ్చారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు, వరదలతో ఆపదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా ప్రతీ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్, స్పెషల్ పార్టీ నుంచి 20 మంది కానిస్టేబుళ్లు మొత్తం 44 మందికి శిక్షణతోపాటు అవసరమైన రక్షణ పరికరాలు సమకూర్చామని తెలిపారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని కాపాడడంతోపాటు రక్షణ చర్యల్లో భాగంగా రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా పడిపోయిన చెట్లను తొలగిస్తారని అన్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో ఏర్పడే వరదతో లోతట్టు ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ, పశువుల నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజారక్షణలో భాగంగా వరద పరిస్థితుల్లో వినియోగించే 10 సీటర్ బోట్, మెడికల్ స్ట్రెచ్చర్స్, వుడ్ కటర్స్ తదితర పరికరాలతో అందుబాటులో ఉండి రక్షణగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీలు ప్రకాశ్, రమేశ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, పోలీస్ అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వండి.. వడ్డించే వరకు జాగ్రత్తలు



భోజనం వడ్డిస్తున్న కార్మికులు

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించే కార్మికుల వేషధారణ మారనుంది. భోజనం వండే దగ్గర నుంచి వడ్డించే వరకు జాగ్రత్తలు తీసుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా నుంచి ఇద్దరు చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్రస్థాయిలో ఇటీవల శిక్షణ ఇచ్చారు. వారు జిల్లాలోని మిగతా మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నారు. శుభ్రత పాటించాలని, కూరగాయలు కోయడం, బియ్యంలో ఇసుక, చెత్త లేకుండా చేయడంతోపాటు వెంట్రుకలు జాగ్రత్తలు పాటించాలని నేర్పించారు. కార్మికులు చేతులకు గ్లౌజ్‌లు, తలకు కవర్ ధరించాలని నిబంధనలు విధించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికురాలు శ్రీదేవి హైదరాబాద్‌లో శిక్షణ పొందింది. బుధవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండి వడ్డించే వరకు జాగ్రత్తలు పాటించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

బెజ్జూర్(సిర్పూర్): విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృత్యువాత పడిన ఘటన బెజ్జూర్ పంచాయతీ పరిధిలోని గోల్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజామున వీచిన బలమైన ఈదురుగాలులకు గోల్కొండలో విద్యుత్ తీగలు తెగి అప్పల వెంకమ్మకు చెందిన మూడు గేదెలపై పడ్డాయి. స్థానికులు గుర్తించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించినా అప్పటికే అవి మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితురాలు వేడుకుంది.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

తిర్యాణి(ఆసిఫాబాద్): తరచూ ఫోన్‌లో మాట్లాడొద్దని తల్లి మందలించడంతో తిర్యాణి మండలం బుగ్గగూడలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గగూడకు చెందిన బాలిక(16) కొన్నిరోజులుగా మామయ్య వరుసయ్యే వ్యక్తితో నిత్యం ఫోన్ మాట్లాడుతూ ఉండేది. పలుమార్లు కుటుంబ సభ్యులు మందలించారు. సోమవారం కుటుంబ సభ్యులు వేరే గ్రామానికి పెళ్లికి వెళ్లి వచ్చేసరికి బాలిక ఇంట్లో లేదు. సమీపంలోని గుట్టపై ఫోన్ మాట్లాడుతూ వారికి కనిపించింది. ఇంట్లో పనులు వదిలి ఇక్కడ ఎందుకు ఫోన్ మాట్లాడుతున్నావని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన బాలిక ఇంట్లోని పురుగుల మందు డబ్బా తీసుకుని పంట చేనుకు వెళ్లి తాగింది. గమనించి తల్లి బాలికను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. ఆరోగ్యం మరింత విషమించడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కార్మికునికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిలో జనరల్ మజ్దూర్ కార్మికుడు మల్లెపూల అనిల్‌కుమార్ గాయాలపాలయ్యాడు. గని భూగర్భంలోని 2ఏ సీమ్, 23 లెవల్ వద్ద హాలర్ అమర్చుతున్నారు. ఈ క్రమంలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ టీంలు రెండూ అక్కడే పని చేస్తున్నాయి. హాలర్‌కు తాడును బిగించేందుకు లాగుతుండగా తాడు తెగి అనిల్‌కుమార్ ఎడమ కాలుకు తగిలింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే ఉపరితలానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి రామకృష్ణపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాలు విరిగినట్లు నిర్ధారించి వైద్యులు చికిత్స చేశారు. సరైన పర్యవేక్షణ లేకనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.



చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్

పదేళ్లుగా ప్రమోషన్లు బంద్

- ఎస్‌డీఎల్ ఆపరేటర్ పదోన్నతుల్లో జాప్యం
- యాక్టింగ్‌లకే పరిమితం
- ఆర్థికంగా నష్టపోతున్న కార్మికులు



ఎస్‌డీఎల్ యంత్రం

శ్రీరాంపూర్: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఎస్‌డీఎల్ యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ యంత్రాలపై పని చేసే ఆపరేటర్లను మాత్రం యాజమాన్యం పట్టించుకోవడం లేదు. కంపెనీ వ్యాప్తంగా పదేళ్ల నుంచి ఎస్‌డీఎల్ ఆపరేటర్ ప్రమోషన్లు ఇవ్వడం లేదు. ఏళ్ల తరబడి ఆపరేటర్లుగా యాక్టింగ్‌లైతే చేస్తున్నాం గానీ ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. జనరల్ మజ్దూర్ కార్మికులు ఎస్‌డీఎల్ యంత్రాలపై యాక్టింగ్‌లు చేస్తే నిర్ణీత యాక్టింగ్‌లను బట్టి ప్యానల్ జాబితా తయారు చేసి ఖాళీల ఆధారంగా ఎస్‌డీఎల్ ఆపరేటర్ లెటర్ ఇస్తారు. దీంతో ప్రమోషన్ వచ్చి వేతనం పెరుగుతుంది. ఎస్‌డీఎల్ ఆపరేటర్‌కు 6వ కేటగిరీ వేతనం లభిస్తుంది. ఏళ్ల తరబడి యాక్టింగ్ చేస్తున్న వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదు. సంవత్సరంలో 150 మస్టర్లు నిండితే ఎస్‌డీఎల్ ఆపరేటర్ ప్రమోషన్ ఇవ్వాలి. పర్మినెంట్ లెటర్ వచ్చేంత వరకు యాక్టింగ్ చేస్తే ఆ కాలానికి కేవలం 5వ కేటగిరీ వేతనం ఇస్తారు. ఇలా ఏళ్ల కొద్ది ప్రమోషన్లు ఇవ్వక యాక్టింగ్ చేయడం వల్ల తాము ఒక కేటగిరీ వేతనం తక్కువ పొందడంతోపాటు ఆ డిజిగ్నేషన్‌పై వచ్చే ఇతర సదుపాయాలు, ప్రమోషన్లు నష్టపోతున్నామని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. ప్రతీ నెల ఇన్సెంటీవ్‌ను కూడా కోల్పోతున్నామని వాపోతున్నారు. శ్రీరాంపూర్ వంటి ఏరియాల్లో ఇలా సుమారు 150 మంది ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

కాలం చెల్లిన యంత్రాలపై..

ప్రతీ గనిలో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు నడుపుతున్నారు. ఇవి క్షేత్ర స్థాయిలో ఉత్పత్తిలో వాడుతున్నప్పటికీ రికార్డులో చూపడం లేదు. దీంతో ఐఈడీ నామ్స్ ప్రకారం దీనిపై పని చేసే వారికి యాక్టింగ్‌లు కూడా లెక్కలోకి రావడం లేదు. ఈ కారణంతోనే ఎస్‌డీఎల్ ఆపరేటర్ల ఖాళీలను చూపడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. అధికారులు శ్రమ దోపిడీ చేస్తున్నారని వాపోతున్నారు. అధికారులే నిబంధనలు ఉల్లంఘించి యంత్రాలను వాడుతూ ప్రమోషన్లు ఇవ్వక తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరో పక్క కొన్ని గనుల్లో యాక్టింగ్‌లు కూడా రాయక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఎస్‌డీఎల్ ఆపరేటర్ ప్రమోషన్లను ఇవ్వాలని కోరుతున్నారు.

వెంటనే ఇవ్వాలి

పదేళ్ల నుంచి ప్రమోషన్లు ఇవ్వక కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి ఎస్‌డీఎల్ ప్రమోషన్లు ఇవ్వాలి. దీనిపై యాజమాన్యంతో చర్చిస్తాం. ఎస్‌డీఎల్ యంత్రాలపై పని చేస్తే తప్పక యాక్టింగ్‌లు రాయాలి, యాక్టింగ్‌ల ప్రకారం ప్రమోషన్లు కూడా ఇవ్వాలి.

– ఎస్కే బాజీసైదా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

హరితహారానికి సన్నద్ధం

- 20లక్షల మొక్కలు లక్ష్యం
- ప్రతీ ఇంటికి ఆరు పంపిణీ

శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యం
అటవీశాఖ: 3.50లక్షలు
మున్సిపాలిటీలు: 3.50లక్షలు
సింగరేణి : 4.20 లక్షలు
డీఆర్‌డీవో : 20 లక్షలు



మొక్కలు నాటడానికి గుంతలు తీస్తున్న కూలీలు

పాతమంచిర్యాల: జిల్లాలో పదో విడత హరితహారం మొక్కలు నాటే కార్యక్రమ నిర్వహణకు సన్నద్ధం అవుతున్నారు. జిల్లా హరితహార లక్ష్యాన్ని మార్చిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా, జిల్లా అటవీ అధికారి కన్వీనర్‌గా నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కోఆర్డినేటషన్ కమిటీ సభ్యులు నిర్ణయించారు. జిల్లాలోని 310 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో 32 లక్షల మొక్కలు పెంచుతున్నారు. గత ఏడాది నాటిన మొక్కలు వివిధ కారణాలతో చనిపోతే వాటి స్థానంలో మళ్లీ నాటనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. పంచాయతీల్లోని నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలే కుండా మున్సిపాలిటీ ఇతర నర్సరీల్లో 2 మీటర్ల కంటే ఎత్తు ఉన్న మొక్కలు నాటాలని నిర్ణయించారు. పూలు, పండ్లమొక్కలతోపాటు నీడనిచ్చే మొక్కలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల స్థలాలు, రోడ్లకు ఇరువైపుల నాటనున్నారు. గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీడ, చల్లదనం కోసం పండ్లు, పూలజాతి మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీ ద్వారా ప్రతీ ఇంట్లో 6 మొక్కలు పూలు, పండ్లజాతి మొక్కలు కచ్చితంగా నాటి సంరక్షించే బాధ్యతను కుటుంబాల యజమానులు అప్పగించే విధంగా ప్రణాళిక తయారు చేస్తున్నారు. హరితహారం కోసం జూన్ నెలాఖరు వరకు గుంతలు తీసే కార్యక్రమం పూర్తి కానుండగా జూలై 5నుంచి మొక్కలు నాటనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని నర్సరీల్లో వనసేవకులతోపాటు 3 వేల మంది కూలీలు మొక్కల పెంపకం, సంరక్షణ పనులు చేస్తున్నారని, ప్రతీ నర్సరీలో మొక్కల సంరక్షణ చేపట్టామని తెలిపారు.

అవగాహన కల్పిస్తాం..

ఈ దఫా నిర్వహించే హరితహారం కార్యక్రమంలో ప్రతీ గ్రామంలో హరితహారం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. చెట్ల పెంపకం, వాటి ప్రయోజనాలపై వివరిస్తాం. ప్రతీ ఇంట్లో మొక్కలు పెంచుకునేలా చైతన్యపరుస్తాం. ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి సంరక్షణ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– పి.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మంచిర్యాల

ఏరియా ఆసుపత్రి నిర్వీర్యానికి కుట్ర

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆసుపత్రి నిర్వీర్యానికి యాజమాన్యం కుట్రలు చేస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శాంతిఖని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్ విమర్శించారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి గనిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందుబాటులో లేకుండా చేయడానికి ఉద్దేశ్యపూర్వకంగా యత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే వార్డుల మూసివేత చేపట్టగా సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం వైద్యసేవలను మరింతగా విస్తృతం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అసిస్టెంట్ సెక్రెటరీ మంతెన రమేష్, ఉపాధ్యక్షుడు బుర్క ప్రశాంత్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు మిట్టపల్లి రమేష్, పొట్ల రాజలింగు, ఏఐటీయూసీ శ్రేణులు పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- నర్సింగ్‌హోం ఎదుట బైఠాయింపు


కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓ నర్సింగ్‌హోంలో కృష్ణవేణి(27) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన కృష్ణవేణి జ్వరం, ఒళ్లు నొప్పులతో మూడు రోజుల క్రితం పట్టణంలోని ఓ నర్సింగ్‌హోంలో చేరింది. చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. డాక్టర్లు ఇచ్చిన ఇంజక్షన్ కారణంగానే కృష్ణవేణి మృతి చెందిందని ఆరోపిస్తూ నర్సింగ్‌హోం ఎదుట కుటుంబ సభ్యులు బైఠాయించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై సోనియా ఘటనా స్థలికి చేరుకుని ఆస్పత్రి వైద్యుడు, మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మధ్యవర్తులు రాజీ కుదర్చడంతో బాధితులు ఆందోళన విరమించారు. మృతురాలికి భర్త బడికెల పర్వతాలు, కుమార్తె కావ్యశ్రీ, కుమారుడు శివతేజ ఉన్నారు.



నర్సింగ్‌హోం ఎదుట బైఠాయించిన బంధువులు

అడవిలోకి చుక్కల దుప్పలు

భీమారం: మండలంలోని కుందారం ఎక్స్‌రోడ్డు సమీప అటవీప్రాంతంలో బుధవారం హైదరాబాద్‌లోని వనస్థలిపురం నుంచి తీసుకొచ్చిన 19 చుక్కల దుప్పులను అటవీశాఖ అధికారులు వదిలిపెట్టారు. మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ రిజర్వులోని మంచిర్యాల–చెన్నూరు కారిడార్ అభివృద్ధిలో భాగంగా వీటిని వదిలినట్లు తెలిపారు. గతంలో కన్నా ఇప్పుడు ఇక్కడి అడవుల్లో నీటి వసతి పెరిగిందని అన్నారు. జంతువులు దాహార్తి తీర్చుకునేందుకు అటవీశాఖ ద్వారా బోర్‌బావి నిర్మించి సోలార్ మోటారు అమర్చామని, నిరంతరం నీరు బయటకు వస్తాయని తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాగరిక, ఎఫ్‌బీవో దీక్ష పాల్గొన్నారు.



అడవిలోకి పరుగులు తీస్తున్న చుక్కల దుప్పలు

కొత్త గనుల కోసం ఐక్యంగా పోరాడాలి

రామకృష్ణాపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు కోసం కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీహెచ్‌పీలో బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొత్త గనులతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఐక్య ఉద్యమ కార్యాచరణ అవసరమని అన్నారు. డిపెండెంట్ల వయోపరిమితి పెంపు విషయంలో అన్ని సంఘాల కృషితోపాటు ప్రస్తుత సీఎండీ బలరాంనాయక్ పాత్ర అభినందనీయని అన్నారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి చొప్పరి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిగిన ప్రాంతం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లి శివారులోని అతిపురాతన కాలంనాటి మడుగు మల్లన్న స్థల ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గ్రామంలో ప్రచారం సాగుతుండగా, తవ్వకాలు జరిగినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. గత నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు వ్యక్తులు ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. పెద్దమ్మ దేవుని చెట్టు ఆవరణలో జరిపిన తవ్వకాల్లో గుప్తనిధులు దొరికినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నారని తెలుస్తోంది.

క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: తెలంగాణలోని మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం మండల, జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతి బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్టు 31, 2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలు 28న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో, మండల స్థాయిలో ఈ నెల 21 నుంచి 25వరకు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని జూలై 7, 8 తేదీల్లో మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో జరిగే పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. జిల్లా నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలు పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా హకీంపేట క్రీడా పాఠశాల, కరీంనగర్‌లోని రీజనల్ క్రీడా పాఠశాల, ఆదిలాబాద్ రీజనల్ క్రీడా పాఠశాలలకు కేటాయిస్తారని తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు ఒరిజినల్, నకలు ప్రతి, బోనఫైడ్ సర్టిఫికేట్ (4వ తరగతి), 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, పుట్టిన తేదీ, కులం, ధ్రువీకరణ పత్రాలు, 5 ఫొటోలతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని కోరారు.

ప్రజా సేవే లక్ష్యంగా పని చేయాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క
- ఆదివాసీలతో ఆత్మీయ సమ్మేళనం

వాంకిడి(ఆసిఫాబాద్): అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వాంకిడి మండలం సవాతి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. మంత్రి సీతక్కకు ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా రాయిసెంటర్ సార్మెడీలు, గ్రామ పటేళ్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాయిసెంటర్ల నిర్వహణకు విధివిధానాలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తామని, రాయిసెంటర్ పరిధిలో మహిళలకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కృషి చేసిన హైమన్ డార్ఫ్ పేరుతో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కుమురంభీం, సూరు ఆశయ సాధనలో ఆదివాసీలు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. కాగా.. మొదటిసారి వాంకిడి మండలానికి వచ్చిన మంత్రికి వివిధ వర్గాల ప్రజలు వినతులు సమర్పించారు. ఆదివాసీ సమస్యలపై రాయిసెంటర్ సార్మెడీలు వినతిపత్రం అందించారు. ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించాలని, దండారీ ఉత్సవాలకు రూ.20వేల చొప్పున ఇవ్వాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని కోరారు. అటవీ అనుమతులు మంజూరు చేయాలని వివిధ గ్రామాల పటేళ్లు విన్నవించారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

దండేపల్లి: బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి తహసీల్దార్ సంధ్యారాణి జైలు శిక్ష విధించారు. లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ నర్సింహులు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాగం ధర్మయ్య నాటుసారా విక్రయిస్తూ పట్టుబడగా గత ఏడాది జూన్ 16న దండేపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా విక్రయించడంతో ఇటీవల పట్టుకుని కేసు నమోదు చేశారు. బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా విధిస్తూ తహసీల్దార్ నోటీసు జారీ చేశారు. జరిమానా చెల్లించకపోవడంతో జైలు శిక్ష విధించారు. రిమాండ్ నిమిత్తం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

యువకుడికి దేహశుద్ధి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.7 గ్రామ శివారులో బుధవారం కూరగాయల తోటలో పనిచేస్తున్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. మార్కెట్ ఏరియాలోని ఓ స్వీట్‌హౌజ్‌లో పని చేసే యువకుడిగా గుర్తించారు. ఈ విషయమై కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబును వివరణ కోరగా.. సదరు యువకుడు సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం

జన్నారం: మండలంలోని మురిమడుగు గ్రామ పంచాయతీ సోముగూడెంకు చెందిన మారుబాయి 108 అంబులెన్స్‌లో బుధవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ మునీందర్, పైలట్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మారుబాయికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి వెళ్లి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువై అంబులెన్స్‌లో ప్రసవించిందని తెలిపారు. తల్లి, కొడుకులను దండేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పామని తెలిపారు.



అంబులెన్స్‌లో మగశిశువుతో సిబ్బంది

‘ఎన్నికల హామీల అమలుకు కృషి’

శ్రీరాంపూర్: ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను అమలుకు కృషి చేస్తున్నామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రీరాంపూర్ సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో తాము ఓటమి చెందినప్పటికీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. డిపెండెంట్ల వయోపరిమితి పెంచడం ఐఎన్టీయూసీ కృషి ఫలితమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, జాతీయ సమితి సభ్యుడు భీంరావు, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు తిరుపతిరాజు, పేరం రమేష్, వెంగళ కుమారస్వామి, భూపతి అశోక్, మండ వెంకన్న, రాకేష్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, నీలం సదయ్య, వెంకటేశ్వర్లు, ఫిట్ సెక్రెటరీ శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రావు

మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట, నంనూర్ గ్రామాల్లో సర్వేను కలెక్టర్ పర్యవేక్షించి యాప్‌లోనూ వివరాలు నమోదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి నల్లా కనెక్షన్లు కలిగిన నివాస గృహాలు, ఇంకా ఇవ్వాల్సిన ఇళ్ల వివరాల, నూతనంగా నిర్మించిన ఇళ్లకు ఇవ్వాల్సిన నల్లా కనెక్షన్ల వివరాలన్నీ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు.



గుడిపేటలో మిషన్ భగీరథ సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నష్టపరిహారం పెంచాలని వినతి

జైపూర్: మండలంలోని నర్వ నుంచి మొదలుకుని షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కింద నష్టపోతున్న భూములకు నష్టపరిహారం పెంచాలని కలెక్టర్ సంతోష్‌ను రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎకరాకు రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు డిమాండ్ ఉందని, ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో వేరొక చోట భూమి కొనుగోలు చేసే పరిస్థితి లేదని, పరిహారాన్ని పెంచాలని కోరారు.

గనులపై ఏఐటీయూసీ నిరసన

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట, కాసిపేట–2 గనులపై బుధవారం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిని నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. కాసిపేట–2 గనిపై నిర్వహించిన కార్యక్రమానికి ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై మాట్లాడారు. సింగరేణిలో పని చేస్తున్న ఇంటర్నల్ కార్మికులకు క్లర్క్ పోస్టులు, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగాలు, ఈపీ ఆపరేటర్ పోస్టులు కొత్తగూడంలో డైరెక్టర్లతో మాట్లాడి ఇప్పించామని తెలిపారు. సింగరేణి లాభాల్లో ఈ సంవత్సరం కార్మికులందరికీ 35 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రెటరీ ఎండీ.అక్బర్‌అలీ, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, సురేష్, లింగయ్య, సంపత్, రవీందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట–2 గనిపై నిరసనలో పాల్గొన్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య